# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-05-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.**

**2.** **రాష్ట్ర సమగ్ర అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

**3.** **రైతుల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

**4.** **ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలో ఈరోజు జరిగిన రహదారి ప్రమాదాలలో ఐదుగురు మృతి చెందారు.**

**5.** **రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి.**

==========================

భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఏదైనా సాధించాలనే పట్టుదలకు భగీరథ ప్రయత్నం ఒక స్ఫూర్తి అని పేర్కొన్నారు. గంగను భూమికి తెచ్చిన ఆ మహనీయుడిని స్మరించడం, పూజించడం అందరి కర్తవ్యమని తెలిపారు.

ఇదిలా ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం భగీరథ మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా విశాఖపట్నంలోని గాజువాకలో భగీరథ మహర్షి రాష్ట్ర స్థాయి జయంతి కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పాల్గొన్నారు.

---------------------------

ప్రతి ఒక్కరూ భగీరథ మహర్షిని స్ఫూర్తిగా తీసుకోవాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. భగీరథ జయంతి సందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనంతపురంలో మహర్షి భగీరథ జయంతోత్సవాన్ని ఈ రోజు నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురం బస్ స్టాండ్‌లో భగీరథ మహర్షి విగ్రహానికి పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగీరథుడి స్ఫూర్తితో రాష్ట్రప్రభుత్వం అనేక ప్రాజెక్టులను చేపట్టిందని ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

రైతుల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఖరీఫ్ పంటకాలంలో రైతుల నుంచి 35.94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ధాన్యం కొన్న 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో 8వేల 2వందల 77 కోట్ల రూపాయలకుపైగా జమ చేశామన్నారు. రబీ సీజన్‌లో లక్ష 16వేల 6వందల 27 మంది రైతుల నుంచి 12.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

---------------------------

ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలో ఈరోజు జరిగిన రెండు రహదారి ప్రమాదాలలో ఐదుగురు మృతి చెందారు. జిల్లాలోని జాతీయ రహదారి 16పై కొప్పోలు పైవంతెన మార్గంలో ఆగి ఉన్న లారీని వాహనాన్ని మరో లారీ ఢీకొనటంతో లారీ బోల్తాపడి ముగ్గురు మృతి చెందారని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. మృతులు నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడుకు చెందిన వారిగా గుర్తించామని చెప్పారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో అక్కడ ఆగి ఉన్న కారును వెనక నుంచి మరో లారీ ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు మృతి చెందారని, పలువురికి గాయాలయ్యాయని తెలిపారు.

---------------------------

రాష్ట్ర సమగ్ర అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో 'మన రైతు –మన రామానాయుడు' కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అమరావతి సంపద సృష్టి కేంద్రంగా, అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాంతంగా మారుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలిజేయజేస్తూ,

వాయిస్ ..32 సెకన్లు

---------------------------

ముంబైలో మూడు రోజులుగా జరుగుతున్న వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్.. వేవ్స్ 2025 సదస్సు ఈరోజుతో ముగుస్తుంది. చివరి రోజు అయిన ఈ రోజు క్రియేటోస్పియర్, వేవ్ ఎక్స్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అలాగే సాంస్కృతిక, సంగీత ప్రదర్శన విభాగంలో క్రియేట్ ఇన్ ఇండియా చాలెంజ్ ఫైనలిస్టులు విజేతలు వాహ్ ఉస్తాద్ సంగీత కార్యక్రమంలో ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఈరోజు కూడా క్రియేటోస్పియర్, వేవ్ ఎక్స్ అంశాలపై మాస్టర్ క్లాసులను నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రభుత్వ ఉద్యోగాలలో క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ – శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. తిరుపతిలోని శాప్ కార్యాలయంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, క్రీడాకారులు సాధించిన పతకాలు, ప్రతిభ ఆధారంగా ఉద్యోగ నియామకాలు చేపడతామన్నారు. క్రీడలు, క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని ఆయన పేర్కొంటూ,

వాయిస్ .. 29 సెకన్లు

------------------------------

ఈరోజు అంతర్జాతీయ అగ్నిమాపక సిబ్బంది సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది ధైర్య సాహసాలను, విజయాలను, త్యాగాలను గుర్తించడం, అగ్నిమాపకశాఖ ద్వారా ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించి... తద్వారా అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1999వ సంవత్సరం నుండి ప్రతి ఏటా మే 4వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. 1998 డిసెంబర్ 2వ తేదీన ఆస్ట్రేలియాలో జరిగిన అగ్నిప్రమాదంలో ఐదుగురు అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన అనంతరం అగ్నిమాపక సిబ్బంది సేవలను గుర్తించాలని కాంక్షిస్తూ... ప్రతి ఏటా మే 4వ తేదీన అగ్నిమాపక సిబ్బంది సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

------------------------------

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. కోస్తా జిల్లాలైన అల్లూరి సీతారామ రాజు, విశాఖపట్నం, ఉభయ ఉమ్మడి గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలుకు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.

కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఏలూరు జిల్లాలో కురిసిన వర్షంతో రహదారులపై వృక్షాలు నేలకొరిగాయి.

------------------------------

విజయవాడలో కురిసిన భారీ వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. వర్షాల వల్ల ఇంద్రకీలాద్రి ఆలయ ఘాట్ రోడ్డును మూసివేశారు. శ్రీకనకదుర్గానగర్ ద్వారా భక్తులు రాకపోకలు కొనసాగించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. విజయవాడలో ప్రాంతాల్లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పర్యటించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను ఆదేశించారు. మరోవైపు బహిరంగ ప్రదేశాల్లో పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.

------------------------------

ఆంధ్రా విశ్వవిద్యాలయం -ఏయూ ఆధ్వర్యంలో ఈ నెల 7న ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఏపీ ఐసెట్ నిర్వహించనున్నట్లు సెట్ కన్వీనర్ ఎం.శశి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల 30 నిమిషాల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల 30 నిమిషాల వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. మొత్తం 37 వేల 572 మంది ఐసెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

------------------------------

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల రుసుము చెల్లింపు గడువును రేపటి వరకు పొడిగించినట్లు ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు. రుసుము చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఇదే చివరి అవకాశమని, మరోసారి పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు. కాగా ఈ నెల 12వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు.

=====================